REGD. NO. A. 40 విడి ప్రతి 0-3-0 శుక్రవారం 3-4-59

# జమీన్ రైతు

సంపుటి 31 ‡ సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు :: సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ‡ సంచిక 14

# ఆంధ్ర పటేలు శ్రీ కళా అస్తమయం

సర్దార్ పటేల్ నిర్యాణం చెందినప్పుడు భారత రాజకీయాల్లో ఎంతటి శూన్యం ఏర్పడిందో కళా వెంకట్రావుగారు అస్తమించడంతో అంత శూన్యం ఆంధ్రప్రదేశ రాజకీయాల్లో కలిగిందని చెబితే అతిశయోక్తి కాదు. చెల్లాచెదరుగా ఉన్న స్వతంత్రభారతాన్ని సుసంఘటితం చేసిన వల్లభభాయికి, మన వెంకట్రావుగారికి చాలా పోలికలు ఉన్నాయి. వీరిద్దరూ నెహ్రూ, ప్రకాశంలవలె ప్రజా మనుష్యులు కారు. అయితే పట్టాభివలె మేధా సంబంధమైన ఉన్నతశిఖరాలలో విహరించేవారూ కారు. ప్రధానంగా పార్టీ మనుష్యులు. అసంఖ్యాక కార్యకర్తలతో సన్నిహిత సంబంధం కలిగి సంస్థను పటిష్టంచేసి గుప్పెట్లో పెట్టుకునేవారు. పదవుల్లో ఎవరున్నా వీరి కార్యాచరణకు ఆటంకం వుండేది కాదు.

తమ అధికారం, పలుకుబడికి భంగంకలిగితే ఎంతపెద్దవారినైనా ఎదిరించారు; తమ మార్గంలోనుంచి తొలగించారు. నేతాజీ, నారీమన్ లాంటి వారినెందరినో కాంగ్రెసులో పలుకుబడి లేకుండా సర్దార్ పటేల్ చేస్తే, ప్రకాశం రంగాల పట్లకూడా కళా వెంకటరావు అదేవిధంగా ప్రవర్తించారు. సర్దార్‌కి గాంధీజీ అండ చివరిరోజుల్లో మినహా వుండేది. బిర్లా, సారాభాయీల నిధులు వుండేవి. కళా వెంకటరావు సామాన్య కుటుంబీకుడు. స్వంత తెలివితేటలు, పట్టుదల, సంజీవరెడ్డి ప్రభృతుల సాహచర్యం మాత్రమే ఈయన సాధనాలు.

ఉభయులూ అధికారాన్ని గాఢంగా కాంక్షించారు. కాని స్వార్థంలేని విశుద్ధవర్తనులు. ఇద్దరూ చివరిరోజులలో తమ వర్గానికీ, పార్టీకీ అతీతంగా ప్రవర్తించి పూర్వ శత్రుత్వాలను, వ్యతిరేకతలనూ విస్మరించ యత్నించి కృతకృత్యులైనారు.

సర్దార్ పటేల్ 75 ఏళ్ల వయసులో మరణించారు. జీవించివున్నా మరెన్నాళ్లో పదవీ బాధ్యతలను వహించగల స్థితిలో ఉండేవారు కారు. కాని వెంకటరావుగారికి 60 సంవత్సరాలుకూడా నిండలేదు. దేశభక్త కొండా వెంకటప్పయ్య, ప్రకాశం, సాంబమూర్తి వృద్ధాప్యంలో దేశం ఇంకా వారినుంచి ఏమీ ఆశించని దశలో మాగిన పండులా రాలిపోయారు. వెంకటరావుగారు బ్రహ్మాండమైన కార్యభారాన్ని వహించి, ఆయన మినహా మరొకరు దాన్ని మోయలేరని ప్రజలు భావిస్తున్న రోజుల్లో నిర్గమించారు. వ్యవసాయ సంస్కరణలు, భూమ్యాదాయ విధానాల సంస్కరణ, జిల్లా గ్రామ పరిపాలనా పునర్ వ్యవస్థీకరణలాంటి మౌలికమైన, పునాది మార్పులను తీసుకురావాలని నిశ్చయించారు. ఈపనిఅంతా ఒకటి రెండేళ్లలో పూర్తిచేయాలనే సంకల్పంతో నిర్విరామంగా పనిచేశారు. ఈపని పూర్తికాకుండానే మృతిచెందారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ అన్నట్టు "కళా వెంకటరావులేడే. ఇక దేశమేమయ్యేట్లు?" అనుకునేవిధంగా మనలను విడిచి పెట్టి పోయారు. ఆయన స్థానంలో పై బాధ్యతలను వహించగల వారెవరు కాంగ్రెసు నాయకులలో? ఒక్క బూర్గుల రామకృష్ణరావుగారు కనబడుతున్నారు. ఆయనకు తెలంగాణా రెవిన్యూ సమస్యలు కరతలామలకములు. వెంకటరావుగారు వీటిని ఆకళింపు చేసుకున్నట్లే, ఆయన ఆంధ్రప్రాంత సమస్యలను అర్థంచేసుకోగలరు. అయితే ఆయన కేరళ గవర్నర్.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత రాష్ట్ర వ్యవహారాలలో, అటు పరిపాలనలోను, ఇటు సంస్థలోను వెంకటరావుగారి పలుకుబడి, చెల్లుబడి క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. వెంకటరావుగారు ఇక మంత్రివర్గంలో నుంచి తప్పుకోరాదా అని ఆయన హితంకోరేవారు భావిస్తూవచ్చారుకూడా. కాని డెమోక్రటిక్ పార్టీ అవతరణతో పార్టీని కట్టుదిట్టం చేసుకోవడంలోను, తన బలాన్ని సంఘటితం చేసుకోవడంలోనూ సంజీవరెడ్డిగారు ఇతోధికంగా వెంకటరావుగారిపై ఆధారపడక తప్పలేదు. కాంగ్రెసు శాసనసభాపార్టీలో ఇటీవల యింత సందడి చేస్తూవుండడంలో వెంకటరావుగారి 'చేయి' చాలావుందని అందరికీ తెలిసిందే. క్లిష్ట పరిస్థితి ఏర్పడితే వెంకటరావుగారు అద్భుతంగా రాణిస్తారు. చెన్నారెడ్డి ప్రభృతుల కారణంగా ఏర్పడిన సమస్యలను ఎదుర్కొన్నట్టే భూకమతాలపై పరిమితుల నిర్ణయం

—తరువాత 12వ పేజీలో



పూర్వతరానికి చెందిన ఆంధ్రకాంగ్రెసు నాయకుడు, దేశభక్తుడు, రాజకీయ దురంధరుడు, పరిపాలనాదక్షుడు, రెవిన్యూమంత్రి కళా వెంకట్రావుగారు శుక్రవారం (27 తేది) రాత్రి హఠాత్తుగా అస్తమించారు.

వెంకట్రావుగారు మరణానికి మూడురోజుల క్రితంనుండి జ్వరపీడితులై

—తరువాత 12-వ పేజీలో

మలబద్ధకము మిమ్ము క్రుంగదీయుచున్నదా!

## ఆరోగ్య లేహ్యము

(Registered)

మీరు ప్రతిదినము రాత్రి కొలది 'ఆరోగ్యలేహ్యము' సేవించిన ప్రొద్దుననే ఒక్కసారి సాఫీగా మలమును విసర్జింపజేయును. మలబద్ధకము, అతిఉష్ణము, పాలుమాలికను పోగొట్టి శరీరమునందు వుత్సాహమును కలుగజేయును. రక్తశుద్ధి, రక్తవృద్ధిపరచుచు మెదడును దేహమును బలపరచి ఆరోగ్యముగానుంచును. కడుపునొప్పులు, కీళ్లనొప్పులు మలేరియాచలిజ్వరాలకు దివ్యౌషధం-రుచి సువాసన కలిగియుండును.

ప్రతియింట నుండదగిన సంజీవిని!

20 తులముల డబ్బీ 2-0-0 * శాంపిల్ డబ్బీ 0-6-0

☞ అన్ని మందుల షాపులలో దొరకును.

బాబిలాన్‌ఫార్మసి, సుబేదారుపేట - నెల్లూరు

## నాటక సమీక్ష

### శ్రీ దుర్భా రామమూర్తిగారి షేక్స్పియర్ అనుకరణ

# ★★★ రాజ్యకాంక్ష ★★★

ఒక ప్రేక్షకుడు

మొన్న 28 తేదీన నెల్లూరు టవును హాల్లో నెల్లూరు నాట్యమండలి వారు, శ్రీ దుర్భా రామమూర్తిగారు షేక్స్పియర్ 'మెక్ బెత్' ననుసరించి వ్రాసిన 'రాజ్యకాంక్ష' అనే నాటకాన్ని వేశారు.

షేక్స్పియర్ విషాదాంత నాటకాల్లోని ప్రధానపాత్రల్లో ఓ లోపం వున్నది. వాటితో పరిచయం ఎక్కువయినకొద్దీ, వాటిని గురించి మనం తెలుసుకోగలిగిన అంశాలుకూడా ఎక్కువవుతుంటాయి. తిరిగిన కొద్దీ వాటిలోతుకూడా ఎక్కువవుతుంటుంది. మనశక్తినిబట్టీ, సామర్థ్యాన్నిబట్టీ, రసజ్ఞతనుబట్టీ అవి మనకు తమ రహస్యాలను వెలువరుస్తుంటాయి. దేవుళ్లకివలె, ఆదిన, ఓ కోర, తపస్సుచేస్తేతప్ప, ప్రత్యక్షం కామంటాయి.

యీ పాత్రల్లో ఇంకో విశేషంకూడా వున్నది. నాటకంమొదట్లో వున్నట్లు ఇవి చివరిదాకావుండవు. నాటకంసాగినకొద్దీ ఇవికూడా కొద్దికొద్దిగా మారుతుంటాయి. పరిస్థితుల వత్తిడితో నలిగి తరుగుతుంటాయి. తాము కల్పించిన పరిస్థితుల పరిణామాలను వశంచేసుకోలేక, మార్చలేక క్రమంగా క్షీణించడం మొదలెడతాయి. తరువాత కొంతకాలానికి తమ శక్తులను సమీకరించుకోవాలని, పరిస్థితులను జయించాలని ఆఖరుసారిగా ప్రయత్నించి, ఓడిపోతాయి. షేక్స్పియర్ నాటకాలు చదువుతుంటే అడుగడుగునా ఈ పరిణామం మనకి స్ఫురిస్తూనే వుంటుంది.

అందుచేత, షేక్స్పియర్ నాటకంలోని వేషాలువేయడం సులభతరంకాదని కాకలు తీరిన నటులే అంటుంటారు. ఈ రోజుకి కూడా షేక్స్పియర్ పాత్రల అవసరాలని పూర్తిగా తీర్చగలిగామనిగాని, వాటికి న్యాయం చేయగలిగామనిగాని ధైర్యంగా గుండెమీద చెయ్యేసుకొని చెప్పగలవారు బహుకొద్దిమందిమాత్రమే వున్నారు. షేక్స్పియర్ పాత్రలను కళ్ళకు కట్టినట్లు చూపించాలంటే కేవలం వాటి అర్థంచెబితే సరిపోదు. వ్యాఖ్యానాలుకూడా కలపవలసి వస్తుంది. అందుచేత షేక్స్పియర్ నాటకాల్లోని విషాదపాత్రలు ఎప్పటికీ పాతపడిపోవు. శాస్త్రీయ సంగీతంలోని రాగాలవలె కళో పాసకుల శక్తినిబట్టీ, అనుభవాన్నిబట్టీ, రసజ్ఞతనుబట్టీ, రాణిస్తూ మరణిస్తూ వుంటాయి.

షేక్స్పియర్ నాటకాలని రక్తికట్టించాలంటే వాటిని స్టేజిమీదికి ఎక్కించదలచుకున్నవారు తపస్సుతో సమానమయిన కృషిచేయాల్సి ఉంటుంది. ముందు నాటకంలోని అన్ని అంశాలను కూలంకషంగా అవగాహన చేసుకోవాలి. నిరంతరమయిన పాత్రల మానసిక పరిణామాలని తెలుసుకోగలగాలి. ఆపైన వీటన్నిటిని ప్రేక్షకుల కళ్ల ఎదుట ఏవిధంగా నిలబెడతారో తేల్చుకోవాలి. అలాచేసి వారు నాటకానికి న్యాయం చేయగలిగితే నిజంగా వారికి కళాసిద్ధి లభిస్తుంది. కళావాహినిలో గంగాస్నానం చేసిన ఫలితం దక్కుతుంది.

ఇంతవరకూ మన నాటకరంగాన్ని విడిచిపెట్టకుండా అంటిపెట్టుకున్న అభిప్రాయాలు కొన్నున్నవి. వాటిలో మొదటిది ఒక పాత్రను నిర్వహించడానికి దాని తాలూకు డైలాగ్స్ అన్నీ కంఠతావస్తే చాలన్నది. రెండోది, డైరెక్టర్ చేయవలసిందల్లా నటులకి తమ పోర్షన్లు కంఠతా వచ్చేటట్లు చూడడమే నన్నది.

రాజ్యకాంక్ష చూస్తున్నంతసేపు యీ అభిప్రాయాల ప్రభావం కొట్టొచ్చినట్లు కనిపించింది. నటుల దృష్టంతా లైన్లు ఒప్పచెప్పడం పట్లే ఉండిపోయింది. వారందరి మధ్య సమన్వయం కుదరలేదు. నాటకంలోని అంకాలు దారంతో గుచ్చిన పూసలవలె కాకుండా పక్క పక్క పేర్చిపెట్టినట్లుండిపోయాయి. అంచేత నాటకం ప్రేక్షకులను వశ్యులను చేసుకోలేకపోయింది. ఉత్తమకావ్యం కలిగించాల్సిన అనుభూతినిగాని, పారవశ్యాన్నిగాని కలిగించలేకపోయింది. దర్శకుని దృష్టికి సమగ్రత లేనందువల్ల పొరపాట్లతో నిండిపోయింది.

నాటకంచూసిన తరువాత 'రాజ్యకాంక్ష'ను చదివాను. దుర్భా రామమూర్తిగారిపాండిత్యానికి, భాషమీద వారికిగల అధికారానికి చక్కటి నిదర్శనం ఇది. పద్యాలు చాలవరకు బాగున్నాయి. దృశ్యనాటకంగా మాత్రం యిది పనికిరాదనిపించింది. అంతంత పెద్దపెద్ద పద్యాలు, నటనలో గంభీరత లేకపోయినా ఆడంబరం తక్కువకాని సంభాషణలు ఏ దృశ్య నాటకాన్ని రక్తికట్టించలేవు. వాటిని ఒప్పచెప్పేసరికి ఆనటులకి తలప్రాణం తోకకి వస్తుంది. షేక్స్పియరే ఆ రోజుల్లో అందరికి అర్థంకాని పదాలను వాడి ఎరుగడు. అనుకరణలో రామమూర్తిగారీవిషయం దృష్టిలోవుంచుకొని వుంటే బాగుండేది.

నిజానికి చిన్నచిన్నవాక్యాల్లో, మామూలైన సామాన్యపదాల్లో చెప్పడానికి వీలులేని భావం లేదు; స్ఫురింపచేయడానికి సాధ్యంకాని అనుభూతిలేదు. భావ భావాన్ని చేరుకోవడానికి నాటకానికి గాని ప్రతిబంధకం కాకూడదు.

జగద్విఖ్యాత షేక్స్పియరు నాటకాలను తెలుగు ప్రజలకు దర్శనీయం కావించడంలో శ్రీ దుర్భా రామమూర్తిగారు సాహిత్యానికిచ్చే ప్రాధాన్యతనే, నటనకుకూడా యివ్వడం అవసరమని భావిస్తున్నాము.

—



శ్రీ దుర్భా రామమూర్తి గారి రాజ్యకాంక్షలో "వీరసింహ" పాత్రధారిగా నిండుగావున్న శ్రీ గాడేపల్లి రామయ్య

# సినిమా వార్తలు

'భద్రం'

మంచిచిత్రాలు తీద్దామనే ఆశ అడుగంటిపోని నిర్మాతలపైపైనా మన ప్రభుత్వం మొన్నీ మధ్యదాకాకూడా చూసి ఎరుగదు. ఏ సినిమా మానవుణ్ణి కదలించినా, ఆ ప్రభుత్వంఏంచేస్తోందండీ? పన్నులపేరుచెప్పి డబ్బు రెండుచేతులా పోగుచేసుకోవడం తప్ప, అనే పరిస్థితిలో కొన్నాళ్లక్రితం మన సర్కారువారు దయతలచి, సినిమాల్ని ఉద్ధరించాలని పూనుకొన్నారు. అంచేత ఓ తేపు పన్ను లెక్కువచేస్తున్నా, 'ముడిఫిలిం ఇంతేవుంది, దాంతోనే సరిపుచ్చుకోవాలి తప్పదు' అంటున్నా, మరోకేపునించి మంచి చిత్రాలకి బహుమతులివ్వాలని కూడా సంకల్పించారు. ఈ ఉద్దేశంతో దేశానికంతటికీ కలిపి ఓ చిత్రానికి, తరువాత ఎక్కడికక్కడ ప్రాంతీయ చిత్రాలకి బహుమతులివ్వడం మొదలెట్టారు. మొదట్లో యీ ప్రభుత్వ ప్రోత్సాహం విజ్ఞానభవనంలో రాజేంద్రప్రసాద్ నిర్మాతల చేతులకి మెడల్లు గుచ్చడం దాకా పరిమితమయి వుండేది. క్రమంగా కొంత లక్ష్మీప్రసాదంకూడా ఇందులో కలిపి, మంచిచిత్రం నిర్మించిన పెద్దమనిషికి అఖిలభారతస్థాయిలో 20 వేలు, దాని దర్శకుడికి ఐదువేలు యిస్తున్నారు.

ఓ వారం రోజులక్రితం, యీ సంవత్సరపు ఫలితాలను ప్రభుత్వం ప్రకటించింది. కథా చిత్రాల్లో బెంగాలీ చిత్రం 'సాగర్ సంగమె'ని, డాక్యుమెంటరీ చిత్రాల్లో 'రాధాకృష్ణ' అనే చిత్రాన్ని ప్రభుత్వం గతసంవత్సరపు ఉత్తమ సినిమాలని తీర్పుచెప్పింది.

ఇవిగాక అఖిలభారత స్థాయిలో కన్నడ చిత్రం 'స్కూల్ మాస్టర్' మూడవదిగాను, బెంగాలీ చిత్రం 'జలసాగర్' రెండవదిగాను ప్రభుత్వం ఆమోదించిన ఉత్తమ చిత్రాల లిస్టులోకి ఎక్కాయి. డాక్యుమెంటరీ చిత్రాల్లో ఇంగ్లీషు చిత్రం 'స్టోరీ ఆఫ్ డాక్టర్ కార్వే' రెండవదనీ, 'కాల్ ఆఫ్ ది మౌంటెన్స్' మూడవదని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇక ప్రాంతీయ భాషా చిత్రాల్లో రాష్ట్రపతి రజిత పతకాలకి అర్హతవున్న చిత్రాలుగా ప్రభుత్వం కేరొన్నవి. 'సాగర్ సంగమె' (బెంగాలీ) 'స్కూల్ మాస్టర్' (కన్నడం) మధుమతి (హిందీ) 'డాంగా పోలీస్' (అస్సామ్), పెళ్లినాటి ప్రమాణాలు (తెలుగు)

ఇవికాక ఈ చిత్రాలకి ప్రశంసాపత్రాలు ఇస్తారు. లాజోవంతి, కారిగర్ (హిందీ); ధర్తీచా పూ (మరాఠీ); జలసాగర్, డాక్ హర్కరా (బెంగాలీ); తంగపదుమై, అన్నయిన్ ఆనై (తమిళం); మాంగల్య బలం

—తరువాత 10వ పేజీలో



